



ముకుందా.. ముకుందా

● వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఘనంగా జన్మాష్టమి వేడుకలు



మేడ్చల్ మండలం డబీల్‌పూర్ ఇస్కాన్ ఆలయంలో భక్తులు

శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సోమవారం వైభవంగా జరుపుకున్నారు. వేణుగోపాలస్వామి ఆలయాల్లో కృష్ణుడికి ఉయ్యాలసేవ, పంచామృతాభిషేకం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు, అన్నదానాలు చేశారు. అంతేకాకుండా వాడవాడల్లో ఉట్లు కొట్టారు. పాఠశాలల్లో వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారు రాధాకృష్ణుడి వేషధారణల్లో నృత్యాలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ ఆకట్టుకున్నారు. రాధాకృష్ణుల వేషధారణలతో చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. అంతేకాకుండా ఇళ్లలో తమ పిల్లలను తల్లిదండ్రులు గోపిక, కృష్ణుడిగా ముస్తాబు చేసి తనివితీరా ఆనందించారు.

- తాండూరు/ఘట్‌కేసర్, ఆగస్టు 26



తాండూరులో ఉట్టి కొడుతున్న చిన్నారులు

డంపింగ్ యార్డును తరలించాలి

» జేఏసీ ఆధ్వర్యంలో నిరసన



రోడ్డుపై బైఠాయించి చెత్త లారీలను అడ్డుకున్న నిరసనకారులు

కీసర రూరల్, ఆగస్టు 26 : జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు కాలుష్యం నుంచి తమను రక్షించాలని కోరుతూ డంపింగ్‌యార్డు పోరాట సమితి(జేఏసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు చెత్తను తరలిస్తున్న లారీలను అడ్డుకుని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ దశల వారీగా డంపింగ్‌యార్డును తరలిస్తామని చెప్పిన అధికారులు, పాలకులు ఆదిశగా చర్యలు తీసుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటాయించిన దాని కంటే అధిక విస్తీర్ణంలో చెత్తను వేస్తూ రాంకీ సంస్థ గుండ్ల కుంట చెరువును నామరూపాల్లేకుండా చేసారని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య నీటితో సాగు భూములను నిస్సారం చేస్తున్నారన్నారు. నిరసన కారులు రోడ్డుపైనే బైఠాయించటంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు నిరసనకారులను కీసర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కేతె పద్మాచారి, సుదర్శన్‌రెడ్డి, సంజీవరెడ్డి పోతరాజు రాములు, స్వర్ణ, శాంతి, సమ్మిరెడ్డి, రామక్రిష్ణ, రవికుమారెడ్డి, పాల్గొన్నారు.




ఘనంగా రామలింగేశ్వరుడి పల్లకీ సేవ

కీసర, ఆగస్టు26: కీసరగుట్టలో రామలింగేశ్వరస్వామి పల్లకీ సేవ కనుల పండువగా జరిగింది. సోమవారం జరిగిన వేడుకల్లో భాగంగా ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో సుధాకర్ అధ్వర్యంలో ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆనంతరం భక్తుల సమక్షంలో స్వామివారి ఉత్సవ మూర్తులను ఆలయ పరిసరా ప్రాంతంలో పల్లకీలో ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొన్నారు.

కొడంగల్‌కు మహర్దశ!

సీఎం నియోజకవర్గం కడా పరిధిలో అభివృద్ధి పనులకు బాటలు

సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌కు మహర్దశ పట్టనుంది. కడా కింద అన్నీ విధాలుగా అభివృద్ధి కోసం బాటలు పడతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో ఆర్ అండ్ బీ డబుల్ లైన్ రోడ్లు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తాజాగా పంచాయతీ రాజ్ రోడ్లు, గ్రామీణ అంతర్గత రోడ్లు, గిరిజన తండాలను కలిపే వాటిని గుర్తించి బీటీ రోడ్లుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపించారు.



» పీఆర్ రోడ్ల అభివృద్ధికి రూ.1100 కోట్ల ప్రతిపాదనలు
» గ్రామాల అభివృద్ధికి వేయి కోట్లతో ప్రణాళికలు
» కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల సుందరీకరణకు రూ.400కోట్లపైగా నిధులు



బీటీ రోడ్డుగా మారనున్న నాగారం-జుంటుపల్లి రోడ్డు

కొడంగల్, ఆగస్టు 26: కొడంగల్ నియోజవర్గం అభివృద్ధిలో భాగంగా కడా(కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) కింద అన్నీ విధాలుగా అభివృద్ధి కోసం బాటలు పడనున్నాయి. ఇప్పటికే నియోజకరవ్గ పరిధిలో ఆర్‌అండ్‌బీ డబుల్ లైన్ రోడ్లు రూ.344.5 కోట్లతో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. తాజాగా పంచాయతీ రాజ్ రోడ్ల అభివృద్ధికి రూ.1130 కోట్లతో గ్రామీణ అంతర్గత రోడ్లు, గిరిజన తండాలను కలిపే వాటిని గుర్తించి బీటీ రోడ్లుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపించారు. రోడ్ల అభివృద్ధి కోసం రూ.1130 కోట్ల అంచనా వ్యయంతో త్వరలోనే మంజూర్‌తో పనులు ప్రారంభం కానున్నట్లు కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. కొడంగల్ ప్రాంత అభివృద్ధికి కడా ఏర్పాటు చేసి సమస్యలను గుర్తించడంతో వాటి పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేసి చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు సీఎస్ శాంతికుమారి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్‌తో పాటు వికారాబాద్, నారాయణపేట్ జిల్లాల కలెక్టర్‌లు తరచూ పర్యటనలతో అభివృద్ధికి బాటలు వేయనున్నారు.



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి (ఫైల్)

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

కొడంగల్ నియోజకవర్గంలో కడా పరిధిలో ఉన్న గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ఇతరాత్ర ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం రూ.వేయి కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. గ్రామాలు, తండాల్లో ప్రధానంగా శిథిలావస్థకు చేరిన పాఠశాలలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు, నూతన కమ్యూనిటీ హాళ్లు, తాగునీటి సరఫరా కోసం వాటర్ ట్యాంకులు, డ్రైనేజీలు ఏర్పాటు చేయనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో గ్రామాల అభివృద్ధికి త్వరలోనే నిధుల మంజూరుతో పనులు ప్రారంభం కానున్నాయి.

మున్సిపాలిటీల సుందరీకరణ

నియోజకవర్గానికి గుండెకాయగా ఉన్న కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల్లో సమస్యల గుర్తింపుతో కడా కింద ప్రభుత్వానికి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించారు. మున్సిపాలిటీల సుందరీకరణలో భాగంగా రూ.400 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపించారు. త్వరలో నిధుల మంజూరుతో పనులు ప్రారంభం కానున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో ప్రధానంగా కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తా, వినాయక చౌరస్తా విస్తరణ పనులు, రోడ్డుకిరువైపులా వైండిగ్‌తో హైమాస్ట్ దీపాల ఏర్పాటు, కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతరాత్ర పనులు చేపట్టనున్నాయి. కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా కోసం రూ.40 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.121 కోట్లు, వర్షపు నీరు నిల్వ కోసం రూ.62 కోట్లు, పట్టణాల్లో ఇరువైపులా వైండింగ్ కోసం రూ.54 కోట్లు, స్టేడియం, ప్లే గ్రౌండ్ కోసం రూ.12 కోట్లతో పాటు ఇతరాత్ర పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.344.5 కోట్లు

కొడంగల్ నియోజకవర్గంలోని పలు ప్రధాన గ్రామాలను కలిపే సింగిల్ లైన్ రోడ్లను డబుల్ లైన్ రోడ్లుగా మార్చేందుకు నిధులు మంజూరయ్యాయి. అందులో భాగంగా డబుల్ లైన్ రోడ్డు నిర్మాణం కోసం రూ.344.5 కోట్ల అంచనాతో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. అందులో హస్నాబాద్ నుంచి నీటూర్ వరకు ఆలేడ్ నుంచి హకీంపేట్ మీదుగా పోలెపల్లి, దిర్సంపల్లి వరకు, అంగడిరైచూర్ గేటు నుంచి రుద్రారం వరకు, రావుల్‌పల్లి నుంచి దౌల్తాబాద్ వరకు తదితర గ్రామాల రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.



అభివృద్ధి చెందనున్న ధర్మాపూర్ రోడ్డు



పెరటికోళ్ల పెంపకానికి చేయూత

» మేడ్చల్ జిల్లాలో 250 యూనిట్ల లక్ష్యం .. 94 యూనిట్లు ఎంపిక
» స్త్రీ నిధి నుంచి ఆర్థిక సాయం » దశల వారీగా కోళ్ల ఫారాల ఏర్పాటుకు చర్యలు

మేడ్చల్ ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఇప్పటికే మహిళా క్యాంటీన్‌లతో పాటు పలు బాధ్యతలను మహిళలకు అప్పగించింది. తాజాగా పెరిటికోళ్ల పెంపకం బాధ్యతలు కూడా అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల కాలంలో వాటి పెంపకం కొంత మేర తగ్గిపోవడంతో కోడిమాంసం, గుడ్లకు మంచి డిమాండ్ ఉన్నందున ఈ దిశగా దృష్టి కేంద్రీకరించింది. స్వయం సహాయక సంఘాల సభ్యులతో నాటు కోళ్ల పెంపకం చేపట్టి అదనపు ఆదాయ వనరుగా మార్చాలని సంకల్పించింది. ఇందుకు జిల్లా వ్యాప్తంగా యూనిట్ల లక్ష్యాలను నియమించింది.

అదనపు ఆదాయ వనరుగా...

ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను ఒక్కొక్కటిగా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తుంది. ఈ క్రమంలో పెరటికోళ్ల పెంపకం చేపట్టేలా దృష్టి సారించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు వీటి పెంపకం సులభం. ప్రత్యేకంగా దాణా వేయాల్సిన అవసరం లేదు. తృణధాన్యాలు, గడ్డిగింజలు, కీటకాలు, చెదలు, వానపాములను తింటాయి. వీటి మాంసంలో అధిక పోషకాలు ఉంటాయని వైద్యనిపుణులు సూచిస్తున్న విషయం తెలిసిందే. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సహాయక సంఘాల సభ్యులతో దశల వారీగా కోళ్ల ఫారాలను ఏర్పాటు చేయించనున్నారు.

మేలు రకం జాతికి ప్రాధాన్యం



రాజశ్రీ, వనరాజా, శ్రీనిధి, గిరిరాజా, అసిల్, కడక్‌నాథ్, గ్రామప్రియ, కృషిబ్రో, రైస్‌బ్రో రోస్టర్ వంటి మేలు రకాలను అందించనున్నారు. స్థానికంగా అందుబాటులో లభించనిచో పొరుగు ప్రాంతాల నుంచి తెప్పించుకునే వెసులుబాటు సైతం కల్పించారు. ఒక్కో కోడి పిల్ల ధర రూ.35, ఒక రోజు వయసున్న పిల్లలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇందుకు ఒక్కో సభ్యురాలికి రూ.1.50లక్షల రుణం స్త్రీ నిధి నుంచి అందిస్తున్నారు. ఇందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. 45 రోజులు అయ్యాక 200 గ్రాముల బరువు కాగానే విక్రయిస్తారు. వీటిని వ్యవసాయ క్షేత్రాల్లోనే కాకుండా తమ ఇంటి పెరట్లోనూ పెంచుకునే అవకాశం ఉంది. జిల్లాలో అన్ని మండలాల్లో ఈ ప్రక్రియను ప్రారంభించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కార్యాచరణ రూపొందించారు.

జిల్లాలో 250 యూనిట్ల లక్ష్యం

జిల్లాలో 250పెరటి కోళ్ల యూనిట్ల లక్ష్యంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే 40 యూనిట్లను గుర్తించారు. మూడు కోడి పిల్లల పెంపకం(మదర్ యూనిట్లు) యూనిట్లను ఎంపిక చేయనున్నారు. 50కోళ్ల యూనిట్‌కు ఒక్కోపెరిటి కోడికి రూ.85 చొప్పున 4,250, కోళ్ల గూడుకు రూ.5 వేలు, మేత, ఇతర ఖర్చులు రూ.3వేలు, మొత్తం 12,500 అందించనున్నారు. అదేవిధంగా 100 కోళ్ల యూనిట్‌కు ఒక్కో పెరటి కోడికి రూ. 85 చొప్పున రూ.8,500, కోళ్ల గూడుకు రూ.7,500, మేత, ఇతర ఖర్చులకు రూ. 6వేలు, మొత్తం రూ. 22వేలు అందించనున్నారు.

లబ్ధిదారుల ఎంపిక

శ్రీనిధి నుంచి జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పెరటి కోళ్ల పెంపకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాకు 250 యూనిట్లు లక్ష్యంగా పెట్టుకుని, ఇప్పటి వరకు 94 యూనిట్లు గుర్తించాం. ఈ విషయమై క్షేత్రస్థాయిలో అధికారులు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

- సాంబశివరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

బాస్కెట్ బాల్ చాంపియన్ మేడ్చల్



బాలికల విజేత మేడ్చల్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఆనంద్‌గౌడ్

రన్నర్‌గా నిలిచిన వికారాబాద్

బాలికల విభాగంలో తృతీయ స్థానంలో రంగారెడ్డి జట్టు

7

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

» కుషాయిగూడ ఏసీపీ మహేష్

కీసర రూరల్, ఆగస్టు 26: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని కుషాయిగూడ ఏసీపీ మహేష్ అన్నారు. నాగారం మున్సిపాలిటీ సుర్వి బాబయ్య ఫంక్షన్‌హాల్‌లో సోమవారం కీసర సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవ నిర్వాహకుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మహేష్ మాట్లాడుతూ.. గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా నిర్వహించుకోవాలన్నారు. వివాదాస్పద స్థలాల్లో, రోడ్డును కబ్జా చేస్తూ వినాయక మండపాలను ఏర్పాటు చేయరాదని సూచించారు. డీజే సౌండ్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యుత్, అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలపాల వద్ద దొంగతనాల నియంత్రణకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. మండపాల వద్ద మద్యం సేవించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల వద్ద, నిమజ్జన సమయంలో హోరెత్తించే విధంగా డీజే సౌండ్‌ను అనుమతించబోమన్నారు. పోలీస్‌శాఖ వారి సూచనను అతిక్రమిస్తే డీజే సౌండ్ సిస్టంను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, ఎస్ఐలు వెంకటేష్, నాగరాజు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ మహేష్

సప్తవర్ణాలు

చినుకులు కురిసిన వెంటనే ఆకాశంలో సప్తవర్ణాలతో ఏర్పడిన ఇంద్రధనస్సు కనువిందు చేసింది. ఒక్కసారిగా ఆకాశం నుంచి నేల మీదకు వంగిన హరివిల్లు చూపరులను ఆకర్షించింది. ఈ హరివిల్లు సోమవారం వికారాబాద్, ధారూరు, నవాబుపేటలో సాయంత్రం కనిపించింది.

- వికారాబాద్/ధారూరు/నవాబుపేట, ఆగస్టు 26





జానపద కళాప్రదర్శనకు కళాకారులు సిద్ధమవ్వాలి

కొడంగల్ రూరల్, ఆగస్టు 26: ఈనెల 29న కోస్గి పట్టణంలోని ఏబీకే ఫంక్షన్‌హాల్‌లో జానపద కళాప్రదర్శనకు సిద్ధమవ్వాలని జానపద కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణయ్య కళాకారులకు పిలుపునిచ్చారు. కొడంగల్ పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న జానపద కళాకారులు ప్రదర్శనకు సిద్ధమవ్వాలని జానపద కళారూపాలైన డప్పు, డోలు, బంజారా, బుడగజంగం, తోలుబొమ్మలు, యక్షగానం, వీధినాటకం, అడుగుల భజన, కోలాటం, నృత్యం, జడకొప్పు, బైండ్ల, బాలసంతు, సన్నాయి, కొమ్ము, దుమ్మనకొయ్య, వంటి తదితర కళాకారులు తమ ప్రదర్శనను వేదికపై ప్రదర్శించి తమ ప్రతిభను నిరుపించుకోవాలని కోరారు. ప్రదర్శనలో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు 9848265026, 7702215878 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా శకనప్ప, పరమేశ్వర్, బుడగ జంగం నర్సింహులు, అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు యు.రమేష్ బాబు, డీవీఎంసీ మెంబర్ దస్తప్ప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జానపద కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణయ్య

పాత బావికి ప్రాణం

- పూడికతీతతో పుష్కలంగా నీరు
- నాట్లు వేసేందుకు పొలం సిద్ధం


వ్యవసాయ బావికి దిగించిన క్రేన్, పాత బావిలో పూడిక తీస్తున్న కూలీలు

యాచారం, ఆగస్టు 26: అడపాదడపా కురుస్తున్న వర్షాలతో భూగర్భ జలమట్టం పైకొచ్చి పాత బావుల్లో నీరు ఊరుతోంది. ఎండల్లో వందల ఫీట్ల బోరు వేసినా నీరు పడడం లేదు. అలాంటిది ఇప్పుడు కొన్ని పాత బావుల్లో నీరు ఊరుతోంది. అయితే చాలా బావులు ఇప్పుడు వినియోగంలో లేవు. వాటిల్లో పూడిక పేరుకుంది. రైతులు ఎక్కువగా బోర్లపైనే ఆధారపడ్డారు. అయితే చౌదర్‌పల్లిలో నాయిని రాంరెడ్డి పొలంలో పాత వ్యవసాయ బావి ఉంది. దానిలో పూడిక పేరుకుంది. దానిలో పూడిక తీస్తే పొలానికి సరిపడా నీరందుతుందని రైతు మల్కీజ్‌గూడ నుంచి క్రేన్ తెప్పించి పూడిక తీస్తున్నాడు. ఐదారు గజాల మందం పూడిక తీస్తే ఈ వానకాలంలో వరి పొలానికి సరిపడా నీరందుతుందని రైతు చెప్పాడు. ఇప్పటికే మూడు గజాల మేర పూడిక తీసినట్టు రైతు చెప్పాడు. మరో నాలుగైదు గజాల మేర పూడిక తీస్తానని రైతు తెలిపాడు.

చింతకాయలు కిలో రూ.200




కొడంగల్ రూరల్, ఆగస్టు 26: మార్కెట్‌లో చింతకాయలకు గిరాకీ పెరిగింది. గోకులాష్టమిని పురస్కరించుకుని సోమవారం ప్రతీఒక్కరు తమఇళ్లలో వండే వంటకాల్లో చింతకాయలను ఉపయోగించాలని తరతరాలుగా వస్తున్న ఆచారం. దీంతో ప్రతీ ఒక్కరు చింతకాయలను కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు తరలివచ్చారు. దీంతో చింతకాయల ధరను వ్యాపారులు ఒక్కసారిగా పెంచి సొమ్ముచేసుకున్నారు. కిలో చింతకాయల ధర రూ.200లకు విక్రయించారు. టమాట, వంకాయ, బీరకాయ, చిక్కుడుకాయ, బెండకాయ తదితర కూరగాయల ధర కిలో రూ.40లకు విక్రయించారు. చింతకాయల ధరలు అమాంతం పెరగడంతో చింతకు భలే ధర ఉందని వినియోగదారులు చర్చించుకున్నారు.

చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్

ఆమనగల్లు, ఆగస్టు 26 : చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ హైకోర్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.శ్రీనివాస్ అన్నారు. బ్రిటీషర్ల నాటి చట్టాలకు తెరపడిందన్నారు. భారత న్యాయ వ్యవస్థలో మూడు కొత్త నేరచట్టాలైన భారతీయ న్యాయ సంహిత, నాగరిక్ సురక్ష సంహిత, సాక్ష్య అధినియమ్ అమల్లోకి వచ్చాయన్నారు. ఆమనగల్లు మండలం అయ్యసాగర్ త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి, మైసిగండి మైసమ్మ ఆలయాలను సోమవారం శ్రీనివాస్ సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా చేసిన మూడు చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని సూచించారు. వాహనదారులు, ప్రయాణికులు విధిగా ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



















ఘట్‌కేసర్ వద్ద ఎరిమల్లెవాగులో పారుతున్న జవహర్‌నగర్ విషరసాయనాలు

పచ్చని చెట్ల మధ్య కలుషితనీరు

ఘట్‌కేసర్, ఆగస్టు 16: ఇరువైపులా అందమైన పచ్చని చెట్ల నడుమ ప్రవహిస్తున్న వాగు ఇది. అందులో అత్యంత ప్రమాదకరమైన హాలాహలం ప్రవహిస్తోంది. నాడు స్వచ్ఛమైన వర్షపునీటితో గలగల పారే ఎరిమల్లెవాగు నేడు పూర్తిగా కలుషితమై జవహర్‌నగర్ డంపింగ్ యార్డు వ్యర్థ రసాయన జలాలతో పారుతోన్నది. పరిసరాల్లోకి వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. జవహర్‌నగర్ నుంచి వచ్చే ఈవాగు అనేక గ్రామాలను దాటుకొని ఘట్‌కేసర్ మీదుగా ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో కలుస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జలాలు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఇమామె ఖాసీం బాబా దర్గా ఉర్సు



ప్రార్థనలు చేస్తున్న ముస్లిం పెద్దలు, ఇమామె ఖాసీం బాబా దర్గా

మేడ్చల్ టౌన్, ఆగస్టు 26: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇమామె ఖాసీంబాబా దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం రాత్రి స్థానిక ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. కులమతాలకు అతీతంగా నిర్వహించే ఉర్సు వేడుకల్లో స్థానికులు పెద్దఎత్తున పాల్గొని దర్గాలో దట్టీలు సమర్పించుకుని మొక్కును తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దర్గాలో షేక్ అక్బర్ పీర్‌బాబా వారి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొనడానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్గాను దర్శించుకోవడానికి స్థానికులే కాకుండా నగరంలోని మారుమూల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తుల కోసం అన్నదానం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఉర్సు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి దట్టీలు సమర్పించుకున్నారు.

రైల్వే గేటు కష్టాలు తీరేదెన్నడో?



బషీరాబాద్‌లో రైల్వేగేటు వేయడంతో నిలిచిన వాహనాలు

బషీరాబాద్, ఆగస్టు 26: బషీరాబాద్‌లోని రైల్వేగేటు వద్ద తరుచూ గేటు పడటంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలన్నీ గేటు దాటి రావాల్సి ఉండటంతో నిత్యం ప్రజలు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. రైలువచ్చిన ప్రతీసారి గేటు వేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. రైలు వెళ్లగానే గేట్ తెరిచినప్పుడు ఒకేసారి ఎదురెదురుగా వాహనాలు వస్తుండటంతో ఒక్కోసారి ట్రాఫిక్ జాం కావడంతో ముందుకెళ్లే పరిస్థితి ఉండదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వేగేటు కష్టాలు తీర్చాలని మండలవాసులు కోరుతున్నారు.

ఫిరంగి కాలువను పరిరక్షించాలి



మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 26: గొలుసు కట్టు చెరువులను నింపేందుకు స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పాటు చేసిన ఫిరంగి కాలువను పరిరక్షించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీధర్ బాబు, చేవెళ్ల, షాద్‌నగర్, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేలకు లేఖలు రాశారు. చేవెళ్ల పరిధి చందనవెల్లి నుంచి 1872లో ఫ్రెంచ్, పర్షియా ఇంజినీర్ల నైపుణ్యంతో ఫిరంగి కాలువను తవ్వారని తెలిపారు. చందనవెల్లి కత్వ నుంచి పాల్మాకుల నందుల కత్వకు నీరు చేరేదన్నారు. నందుల కత్వ నుంచి శంషాబాద్ చెరువుకు, అక్కడి నుంచి మహేశ్వరం మీదుగా ఇబ్రహీంపట్నం పెద్దచెరువుకు నీరు వెళ్లేదన్నారు. పాల్మాకుల నందుల కత్వ నుంచి షాద్‌నగర్‌కు తాగునీరు వచ్చినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయన్నారు. 28గ్రామాలకు, 100వరకు కుంటలు, చెరువులకు వరదాయినిగా ఉన్న ఫిరంగి కాలువ మరమ్మతులకు ఉమ్మడి ఏపీలో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న శ్రీధర్‌బాబు నిధులు మంజూరు చేసినా కార్యరూపం దాల్చలేదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిన తరువాత ఫిరంగి కాలువ ఆక్రమణలకు గురైందన్నారు. ఫిరంగి కాలువపై విచారణ చేసి, కాలువను పునరుద్ధరించాలని ఈ సందర్భంగా నర్సింహులు కోరారు.

తొండిపల్లిలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి



ఎంపీ విశ్వేశ్వరరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

శంషాబాద్, ఆగస్టు 26: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి తొండిపల్లిలో 44వ హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణంతో ట్రాఫిక్ జాం ఏర్పడి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ట్రాఫిక్ జాం సమస్యను నివారించాలని ఆమె కోరారు. దీంతో ఎంపీ తొండిపల్లిలో బ్రిడ్జి నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం చివరి దశలో ఉండటం, బ్రిడ్జి దిగే చోట ర్యాంప్ పనులు చేస్తుండడంతో తొండిపల్లి టోల్‌ప్లాజా నుంచి రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ జాంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఎంపీ గమనించి ట్రాఫిక్ జాం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పరమేష్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

తాండూరు, ఆగస్టు 26: హైదరాబాద్ రోడ్డు మార్గంలోని లారీ పార్కింగ్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 130లో 36 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆ భూమిని కాపాడాలని మాజీ కౌన్సిలర్ సూరజ్ సింగ్ ఠాకూర్ కోరారు. ఆయన సోమవారం కలెక్టర్‌కు, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమ లేవుట్లు సృష్టించి ప్లాట్లకు నంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

షాద్‌నగర్‌కూ హైడ్రా

సీఎంకు విజ్ఞప్తి చేశానన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 26: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)ను షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. దీనికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా హైడ్రా నిర్ణయాలు సంచలనం సృష్టిస్తున్నాయని, అక్రమ నిర్మాణాలు చేపట్టిన బడా బాబులు, సినీ నటులు, సెలబ్రెటీస్ గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోనూ చెరువు, కుంటలను ఆక్రమించి వెంచర్లు, విల్లాలు నిర్మించారన్నారు. వాటిని తొలగించేందుకు నియోజకవర్గం వరకు హైడ్రాను విస్తరింపజేయాలని సీఎంను కోరారని చెప్పారు. గతంలో వికారాబాద్ నుంచి వచ్చే ఫిరంగి కాలువను కూడా ధ్వంసం చేసి నిర్మాణాలు చేపట్టి నీటి సమస్యను సృష్టించారని వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండలం బొబ్బులి చెరువునూ ఆక్రమించారని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ధనదాహంతో చెరువులు, కుంటలను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ భూముల్లో వెంచర్లు వెలిశాయన్నారు. వీటి కట్టడికి హైడ్రాను షాద్‌నగర్ నియోజకవర్గానికి వర్తింపజేయాలని సీఎంను కోరారని ఎమ్మెల్యే వెల్లడించారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

షాద్‌నగర్ అర్బన్: అర్హత కల్గిన ప్రతీ రైతుకు రుణమాఫీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఎమ్మెల్యే శంకర్ ఆదేశించారు. క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఏడీఏ రాజరత్నం, ఏవోలు పాల్గొన్నారు. ఇప్పటి వరకు రుణమాఫీ పొందని రైతుల వివరాలు అడిగారు. రుణం తీసుకున్న రైతుల జాబితాను బ్యాంకర్లు ఇవ్వలేదని, రుణమాఫీ వచ్చిన రైతుల జాబితా మాత్రమే ఉందని తెలిపారు. రుణమాఫీ రాని రైతుల కోసం ప్రభుత్వం యాప్ ఇచ్చిందని, మంగళవారం నుంచి రైతుల వద్దకు వెళ్లి, వివరాలు సేకరించి, అప్‌లోడ్ చేస్తామని ఏడీఏ రాజారత్నం తెలిపారు. మంగళవారం బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తామనిన్నారు. అర్హతున్న ప్రతీ రైతుకు రుణమాఫీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

రాష్ట్రాభివృద్ధికి సాహసోపేత నిర్ణయాలు

కడ్తాల్, ఆగస్టు 26: ప్రజల మేలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల మండలంలో సోమవారం ఆయన పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కడ్తాలలోని పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. వంపుగూడలో అనారోగ్యంతో మృతిచెందిన భీమయ్య మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.5వేలిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాలు, సామాజిక వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆలయాల అభివృద్ధికి, కులవృత్తుల వారి రక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలాన్ని నగర శివారు ప్రాంతాలకు సమాంతరంగా అభివృద్ధి చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు బిక్యానాయక్, నర్సింహ, గూడూరు భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, యాదగిరిరెడ్డి, జహంగీర్ అలీ, జహంగీర్‌బాబ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు శేఖర్‌గౌడ్, బిక్షపతి, నరేశ్ నాయక్, పోతుగంటి అశోక్, ఇమ్రాన్ బాబా, నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు సత్యం యాదవ్, రాములు, మల్లేశ్ గౌడ్,కార్తీక్, రాంచందర్ నాయక్, యాదయ్య గౌడ్, రాములు, జంగారెడ్డి, యాదయ్య, బుచ్చయ్య, శ్రీను, కృష్ణ, పాండు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ రాములు



వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న యువకులు

యువత చెడు అలవాట్లను వదలాలి

పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు

శామీర్‌పేట, ఆగస్టు 26: యువత చెడు అలవాట్లను వదిలివేయాలని ఏసీపీ రాములు పిలుపునిచ్చారు. మండలంలోని మజీద్‌పూర్‌లోని జైన్ హెరిటేజ్ ఇంటర్నేషనల్ పాఠశాల క్యాంపస్‌లో సోమవారం కమ్యూనిటీ పోలీసింగ్ శామీర్‌పేట పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్ క్రీడాపోటీలను ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌తో కలిసి ఏసీపీ రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా గొప్ప ఆశయంతో ముందుకెళ్లాలన్నారు. సమాజంలో ఆదర్శంగా నిలువాలని ఆయన హితవు చెప్పారు. శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ చెడుఅలవాట్లకు వెళ్లి డ్రగ్స్‌కు బానిసైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. యువత నిత్యం క్రీడల్లో శిక్షణ పొందితే భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో రికార్డులను సృష్టించగలుగుతారని యువతకు గొప్ప సందేశమిచ్చారు.

విజేతలకు ప్రోత్సాహక బహుమతులు

ఈ వాలీబాల్ క్రీడాపోటీల్లో ఉమ్మడి శామీర్‌పేట మండలం, తూంకుంట మున్సిపల్ పరిధిలోని యువత 18టీంలుగా వాలీబాల్ క్రీడాపోటీల్లో పాల్గొని ఎంతో ఉత్సాహంగా ఆడారు. మొదటి బహుమతి శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ టీమ్ గెలుపొందింది. ద్వితీయ బహుమతి జగ్గంగూడ టీమ్, తృతీయ బహుమతి తూంకుంట టీమ్ గెలుపొందాయి. ఈ వాలీబాల్ క్రీడాపోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ టీమ్‌లకు సాయంత్రం ఏసీపీ రాములు ప్రోత్సాహక బహుమతుల కప్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు హారిక, మునీందర్, దశరథ్, నాయక్, మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్‌అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ బాలేశ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయకుండానే జీపీఆర్ఎస్ అమలా?

తాండూరు, ఆగస్టు 26: తాండూరు మున్సిపాలిటీలో డీజిల్ అక్రమాలకు చెక్ పెట్టేందుకు జీపీఆర్ఎస్ అమలుకు సిద్ధం చేశారు. మున్సిపల్ కొత్త కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో సోమవారం ఆటోలు, ట్రాక్టర్లకు జీపీఆర్ఎస్ అమలు ప్రక్రియను చేపట్టారు. దాదాపు 18 ఆటోలు, 12 ట్రాక్టర్లు జీపీఆర్ఎస్ అమర్చారు. గతంలో తాండూరు మున్సిపాలిటీలో ఈ సిస్టం అమలు చేసినప్పటికీ సక్రమంగా అమలు కావడంలేదు. ప్రస్తుతం ఈనెల 3న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో జీపీఆర్ఎస్ అమలు చేసేందుకు నిధులు కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. తాండూరు మున్సిపాలిటీలో సగానికి పైగా ఆటోలు, ట్రాక్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. ఆటోలు, ట్రాక్టర్లు, సాంకేతిక కారణాలతో మరమ్మతులు ఉన్నప్పటికీ నెట్టుకొస్తున్నారు. ట్రాక్టర్లకు ఆటోలకు ఆయిల్ పోయించడం లేదని, టైర్లకు ట్యూబ్‌లకు ఇప్పించడం లేదని, చిన్న చిన్న మరమ్మతులు చేయడంలేదని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కండిషన్ లేని వాహనాలతో జీపీఆర్ఎస్‌ను ఎలా కొనసాగిస్తామని శానిటేషన్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. కౌన్సిల్ ఆమోదించిన నిధులను ఖర్చుచేసినట్లు చూపించుకోవడానికి అధికారులు తూతూమంత్రంగా చేయించి లెక్కలు రాసుకోవడానికి తప్ప ప్రయోజనం ఏమీ ఉండదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సిస్టమ్‌తో డీజిల్ వృథాను అరికట్టగలుగుతారో లేదో వేచిచూడాల్సిందే.



ట్రాక్టర్‌కు జీపీఆర్ఎస్ అమరుస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది



బాలుర విభాగంలో రన్నర్‌గా నిలిచిన వికారాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం



ఫైనల్‌లో బాలుర విభాగంలో తలపడుతున్న హైదరాబాద్, వికారాబాద్ జట్లు

బాస్కెట్ బాల్ చాంపియన్ మేడ్చల్

- రన్నర్‌గా నిలిచిన వికారాబాద్
- మూడో స్థానంలో నిలిచిన రంగారెడ్డి, మేడ్చల్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 26: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఐదో రాష్ట్రస్థాయి అండర్-16 బాల, బాలికల బాస్కెట్ బాల్ టోర్నీ ముగిసింది. సోమవారం మహబూబ్‌నగర్ స్టేడియంలో బాలుర విభాగంతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 57-53తో వికారాబాద్‌పై గెలిచి విజేతగా నిలువగా, బాలికల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో మేడ్చల్ జట్టు 58-56తో వికారాబాద్ గెలిచి చాంపియన్‌గా నిలిచింది. రన్నర్‌గా బాల, బాలికల విభాగంలో వికారాబాద్ జట్టు నిలువగా, మూడో స్థానంలో బాలికల విభాగంలో రంగారెడ్డి, బాలుర విభాగంలో మేడ్చల్ జట్లు నిలిచాయి.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని చాటాలని మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. బాస్కెట్‌బాల్ పోటీల విజేతలకు డీఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. రాష్ట్రస్థాయి టోర్నీ జిల్లా కేంద్రంలో నిర్వహించడం సంతోషకరం అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్ మాట్లాడుతూ టోర్నీలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామని, టోర్నీ విజయవంతం చేసేందుకు అసోసియేషన్ సభ్యులు ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది మనోహర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ అప్పయ్య, రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం నుంచి నర్మన్‌ఇసాక్, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం కార్యదర్శి నసూరుల్లా పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 26: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేసినట్టే పార్టీ సభ్యత్వ నమోదులోనూ నాయకులు పనిచేయాలని మెదక్ ఎంపీ, పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం అజీజ్‌నగర్‌లోని ఓ గార్డెన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అధ్యక్షతన సభ్యత్వ నమోదుపై జిల్లాస్థాయి సమావేశంలో ఎంపీ పాల్గొని దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపే సభ్యత్వాలపై దృష్టిపెట్టాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయ భూముల రక్షణకు హైడ్రా స్థాయి కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాల విషయంలో ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రుల వద్ద సమాచారం ఉందని, సీఎస్ స్థాయి అధికారులతో అక్రమ కట్టడాలపై వివరాలు వెల్లడిస్తే ప్రజలే చూసుకుంటారన్నారు. వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. రంగారెడ్డి జిల్లాలో 6లక్షల సభ్యత్వ నమోదులు చేయించాలని అధిష్ఠానం టార్గెట్ ఇచ్చిందన్నారు. సెప్టెంబరు 4వ తేదీ నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కె.విశ్వేశ్వర్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, అంజన్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే రత్నం, జిల్లా సభ్యత్వ నమోదు కమిటీ ఇన్‌చార్జి మధుసూదన్ గుప్తా, చేవెళ్ల కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా, మండలాల నాయకులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలపై గొడ్డలి వేటు



మైతాబ్‌ఖాన్ గూడ గ్రామ రోడ్డులో నరికేసిన చెట్లు

నవాబుపేట, ఆగస్టు 26: పచ్చదనమే ప్రగతికి మెట్టు అనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి నీడనిస్తున్నాయి. నవాబుపేట మండలంలోని మైతాబ్‌ఖాన్‌గూడ, ఎల్లకొండ గ్రామాల రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను విద్యుత్ శాఖ అధికారులు తీగలకు అడ్డుగా ఉన్నాయి. అయితే, చెట్ల కొమ్మలు అడ్డొస్తే కొమ్మలు నరకాలి.. కానీ చెట్లను నరికివేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు కిలో మీటర్‌కు పైగా చెట్లను మొత్తం నరకడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకిరువైపులా నీడనిచ్చే చెట్లను నరకడమేంటని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రంగారెడ్డి ప్రశ్నించారు. సంబంధిత అటవీశాఖ అధికారులు స్పందించి చెట్లను నరికేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ లైన్‌మన్‌ను వివరణ కోరగా విద్యుత్ ఏఈ సూచన మేరకు చెట్లను నరికివేసినట్లు సమాధానమివ్వడం గమనార్హం.



తాండూరు: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి

అధిక సభ్యత్వాలు చేసిన వారికి తగిన గుర్తింపు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శృతి

తాండూరు, ఆగస్టు 26: అత్యధిక సభ్యత్వ నమోదు చేసిన వారికి బీజేపీలో తగిన గుర్తింపు దక్కుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. తాండూరులో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లా స్థాయి పార్టీ పదవులు లభించాలంటే సమావేశంలో కనీసం 200 సభ్యత్వ నమోదు చేసి ఉండాలని అన్నారు. సెప్టెంబర్ 8 నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శ్రీకారం చూడుతున్నామన్నారు. నవంబర్ 10వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆరేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు ఉంటుందని తెలిపారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో పోటీచేసే వారికి కూడా సభ్యత్వ నమోదును పరిగణలోకి తీసుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీ ఎన్నికల్లో 70లక్షల పైచిలుకు ఓట్లు లభించాలన్నారు. సభ్యత్వ ఫీజు చెల్లింపు కేవలం ఆన్‌లైన్ ద్వారానే స్వీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్, సీనియర్ నాయకులు ఎం.నరేష్ మహరాజ్, శివరాజ్, సుదర్శన్ గౌడ్, బంటారం భద్రేశ్వర్ పాల్గొన్నారు.

నవాబుపేట: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ నవాబుపేట మండల ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, దళిత మోర్చా అధ్యక్షుడు గాలయ్య, నియోజకవర్గ కన్వీనర్ రమేశ్, మండల ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, నాయకులు గోపాల్‌రెడ్డి తెలిపారు. మెదక్, చేవేళ్ల ఎంపీలు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తల్లోజు ఆచారి పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. ప్రతీ కార్యకర్త సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్‌లో పల్లె పలకరింపు

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్ మండల పల్లె పలకరింపు కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమన్వయం, గ్రామాల వారీగా మౌలిక సదుపాయాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగురావు, బాబయ్యనాయుడు, శ్రావణ్‌గౌడ్, మల్లేశం, జగదీశ్వర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్: మన్నెగూడ కేశవరెడ్డి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు


మేడ్చల్ టౌన్: ఇస్కాన్ ఆలయంలో కొలువుదీరిన రాధాకృష్ణులు


కీసర: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా చీర్యాల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉజల సేవ


వికారాబాద్: బ్రహ్మకుమారీస్ ఓంశాంతి భవనంలో కృష్ణాష్టమి వేడుకల్లో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎస్సీ నారాయణరెడ్డి

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

కృష్ణాష్టమిని పురస్కరించుకుని సోమవారం వికారాబాద్, మేడ్చల్ జిల్లాలోని కాలనీలు, ప్రైవేటు పాఠశాలల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషాధారణలో ఆకట్టుకుని ఉట్టి పగులగొట్టేందుకు పోటీపడ్డారు. ఈ వేడుకల్లో కాలనీ వాసులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. అదేవిధంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.


శామీర్‌పేట: శ్రీకృష్ణుడి వేషధారణలో బాలుడు


పరిగి: చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారులు


తాండూరు: కృష్ణుడికి ఊయల సేవ


వికారాబాద్: గోపిక వేషధారణలో చిన్నారి


ధారూరు: ఉట్టి కొడుతున్న చిన్ని కృష్ణుడు


పెద్దేముల్: మంబాపూర్‌లో ఉట్టికొడుతున్న చిన్నారులు


కులకచర్ల: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో చిన్నారులతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు


బొంరాస్‌పేట్: వివేకానంద పాఠశాలలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు


పరిగి: వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


దౌల్తాబాద్: వాగ్దేవి పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలతో చిన్నారులు


పూడూరు: సోమన్‌గుర్తి అంగన్‌వాడీ కేంద్రం-1లో కృష్ణాష్టమి వేడుకలు


పూడూరు/మర్పల్లి: శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు

ప్రయాణం.. జర భద్రం


భద్రత లేకుండా పైపులు తరలిస్తున్న లారీ

మేడ్చల్ టౌన్, ఆగస్టు 26: మేడ్చల్‌లో కొనసాగుతున్న రోడ్డు పనుల్లో భాగంగా రహదారి పక్కన ఏర్పాటు చేసిన తాగునీటి పైపులను ఇతర ప్రాంతాలకు తరలించే విషయంలో కనీస భద్రతాచర్యలు చేపట్టడం లేదు. అడ్డగోలు పైపులను లారీల్లో లోడ్ చేసి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలిస్తున్నారు. అయితే, లారీలో లోడ్ చేసిన పైపులు సురక్షితంగా గమ్యానికి చేరుకుంటాయా? లేదా? అనే విషయాన్ని పట్టించుకోవడం లేదు. లారీలో తరలుతున్న పైపులు జారి కింద పడితే లారీ వెనుక వచ్చే వాహన దారులు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. భద్రతా నియమాలను పాటించకుండా పైపులు, సరుకులు తరలించే వాహనాల పట్ల పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఆత్మలింగానికి చెక్కును అందజేస్తున్న మురళీకృష్ణ

వికారాబాద్, ఆగస్టు 26: శ్రావణ మాసం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన శ్రీ కృషి కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు మురళీకృష్ణ బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి రూ.25వేల చెక్కును ఆలయ ధర్మకర్త ఆత్మలింగంకు అందజేశారు. అనంతరం స్వామి వారికి అభిషేకం చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పుండరీకం సత్యనారాయణగౌడ్, షైపాల్‌రెడ్డి, పాణిక్ ప్రభు, చెక్క వీరన్న, వీరేశం, దోసాడా రమేష్ పాల్గొన్నారు.

ధారూరు: స్థానిక వీరభద్రేశ్వర ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి జలం, పంచామృతంతో అభిషేకించి అలంకరించి నైవేద్యం సమర్పించి హారతులిచ్చారు. గణపతి, కుమారస్వామి, వీరభద్రేశ్వరస్వామి, నంది, అమ్మవారి విగ్రహాలకు అభిషేకాలు చేసి అలంకరణ చేసి హారతులిచ్చి మొక్కుకున్నారు. పూజారి చెన్నబసవయ్య స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

శివాలయం నిర్మాణ పనులు ముమ్మరం

కులకచర్ల, ఆగస్టు 26: కులకచర్ల శివాలయం నిర్మాణ పనులు మండల, గ్రామ వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. దాతల విరాళాలతో పనులు చేపట్టారు. కాశీలో ప్రత్యేకంగా తయారు చేయించిన శివలింగం, నంది, ఆంధ్రప్రదేశ్ ఆళ్లగడ్డలో తయారు చేయించిన గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, వీరభద్రస్వామి, అమ్మవారి విగ్రహాలతో పాటు ధ్వజస్తంభం తీసుకొచ్చి కార్తీక మాసం మొదటి వారంలో ప్రతిష్ఠాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


రౌడీషీటర్‌తో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 26: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రతీఒక్కరు సహకరించాలని మల్కాజ్‌గిరి ఏసీపీ ఎస్.చక్రపాణి తెలిపారు. సోమవారం ఆయన ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లతో మాట్లాడారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనద్దని సూచించారు.వినాయక మండపాలకు అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సైదులు పాల్గొన్నారు.

కృష్ణస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలి


పరిగి: కొరివి కృష్ణస్వామికి నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి,ఆగస్టు 26: ముదిరాజ్ ముద్దుబిడ్డ,హైదరాబాద్ నగర తొలి మేయర్ కొవిరి కృష్ణస్వామి ముదిరాజ్ ఆశయసాధనకు కృషి చేయాలని మునిసిపల్ ఛైర్మన్ ఎం.అశోక్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.నాగేశ్వర్‌లు అన్నారు. కొవిరి కృష్ణస్వామి 131వ జయంతి వేడుకలను సోమవారం పరిగిలో ఘనంగా నిర్వహించారు. పరిగిలోని కృష్ణస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైఎస్ ఎంపీపీలు డి.మాణిక్యం, కావలి సత్యనారాయణ, నాయకులు రాంచంద్రయ్య, కృష్ణ పాల్గొన్నారు.

బషీరాబాద్: మండల కేంద్రంలో కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌ల సంఘం ఆధ్వర్యంలో కృష్ణస్వామి ముదిరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రైవేటు కాలేజీలో నియోజకవర్గ, మండలస్థాయి ముదిరాజ్ సంఘం నాయకులు ఉత్తంచంద్, ఎస్.వెంకటేష్ మహారాజ్ నేతృత్వంలో ముది రాజ్ బంధువులు ప్రత్యేక సమావేశమయ్యారు. ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి ముదిరాజ్ భవన నిర్మాణానికి తాండూరులో స్థలం కేటాయించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అనంతరం మండల ముదిరాజ్‌ల సంఘం కమిటీని తాత్కలికంగా ఎన్నుకోన్నారు.ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షులు శ్రీధర్, సంఘం నాయకులు సంగెం హన్మంతు, లొంకా నర్సింహులు, మంతట్టి సురేష్, మోహన్‌ముదిరాజ్, నరేందర్, రాజు పాల్గొన్నారు.

కులకచర్ల: హైదరాబాద్ తొలి మేయర్ కోర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతిని కులకచర్లలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు బుగ్గయ్య, జానకి రాం చౌహన్, రాఘవేందర్‌గౌడ్, మొహ్మద్ రుక్మోద్దీన్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి


వజ్రేష్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైర్ పర్సన్ పావని

ఘట్‌కేసర్, ఆగస్టు26: ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెన నుంచి స్థానిక ఎదులాబాద్ రోడ్డువరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.1.75కోట్ల నిధులు మంజూరుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌ను సోమవారం ఘట్‌కేసర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన నిర్మాణపనుల్లో భాగంగా ట్రాఫిక్‌ను ఎదులాబాద్ రోడ్డు నుంచి మాధవరెడ్డి వంతెన వరకు మళ్లించినట్లు గుర్తుచేశారు. దీంతో ఈరోడ్డు పూర్తిగా పాడై వాహనాల రాకపోకలకు తీవ్రఇబ్బందిగా మారిందన్నారు. ఈరోడ్డుపై బీటీ వేసేందుకు రూ.1.75కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే విధంగా కృషి చేయాలని ఆమె కోరారు. వజ్రేష్ యాదవ్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్ మల్లేష్, నాయకులు ముత్యాలు యాదవ్, నాగరాజు, ఆంజనేయులు, సిరాజ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

హమాలీ కుటుంబానికి ఆర్థిక సాయం


హమాలీ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

ధారూరు: నాగారం గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన అంబేడ్కర్ హమాలీ సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాసు కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తామని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి ప్రకటించారు. ఈ మేరకు మృతుడు శ్రీనివాస్ కుటుంబసభ్యులకు రూ.50వేలు అందిఅందించామన్నారు. మిగతా రూ.50వేలు త్వరలో అందజేస్తామని సోమవారం ఆయన చెప్పారు. కాగా ప్రస్తుతం నాగారం సొసైటీ గోదాంలో ఇస్తున్న హమాలీ చార్జీలను సంచికి రూ.5 నుంచి రూ.7లకు పెంచాలని అంబేడ్కర్ హమాలీ సంఘం నాయకులు చైర్మన్ సత్యనారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అంబేడ్కర్ హమాలీ సంఘం నూతన అధ్యక్షుడిగా బోడ హన్మంత్, ప్రధాన కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా బందయ్యలను ఎన్నుకున్నారు. సంఘం డైరెక్టర్లు గోపాల్‌రెడ్డి, మల్లయ్యలు పాల్గొన్నారు.

కురుమ సంఘం భవన నిర్మాణానికి చర్యలు


సమావేశంలో సంఘం సభ్యులు

తాండూరు రూరల్, ఆగస్టు 26: కురుమ సంఘం భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. గౌతాపూర్ మల్లన్న ఆలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సమావేశంలో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కురుమ సంఘానికి ఇచ్చిన భూమిలో భవనం నిర్మించాలని చర్చించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇంటింటా తిరిగి చందాలు వసూలు చేయనున్నట్లు చెప్పారు. భవన నిర్మాణానికి నియోజకవర్గంలోని కురుమలు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు నాగారం జగదీష్, పూజారి పాండు, జినుగుర్తి నర్సింహులు, చీమల నర్సింహులు, యాలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవ కమిటీ ఎన్నిక

ధారూరు, ఆగస్టు 26: ధారూరు వినాయక ఉత్సవ కమిటీని సోమవారం స్థానిక హనుమాన్ మందిర్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బి.బుజ్జయ్యగౌడ్, అధ్యక్షుడిగా అశోక్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా యు.శశాంక్, బి.రాఘవేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.రవీందర్‌గౌడ్, కోశాధికారిగా రఘుగౌడ్, సంయుక్త కార్యదర్శులుగా వెంకటేశ్, నర్సింహ, కె.రాము, సుధాకర్, శివ, మల్లేశ్, పి.మహేష్, శివకుమార్, సాయి, కార్తీక్‌రెడ్డి, కార్యదర్శులుగా గిరి గౌడ్, కుమార్‌లను ఎన్నుకున్నారు.

మాజీ ఉపసర్పంచ్ మృతి

దోమ, ఆగస్టు 26: మండలంలోని బొంపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ రఫీక్‌పాష (45) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. రఫీక్ పాష మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని పలువురు నాయకులు తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

చట్టాలపై అవగాహన

బొంరాస్‌పేట్, ఆగస్టు 26: మండలంలోని బొట్లవని తండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు చట్టాలపై ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, షీటీం, ఈవ్‌టీజింగ్, డయల్ 100తదితర వాటిపై అవగాహన కల్పించారు.

ఆత్మీయ సమ్మేళనం

వికారాబాద్, ఆగస్టు 26: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత ఉపాధ్యక్షులు సునీతా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. 1964లో ప్రారంభమైన విశ్వహిందూ పరిషత్ 60 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. దేశంలో హిందువులు ఐక్యంగా ఉండి ధర్మస్థాపనకు కృషి చేయాలన్నారు.

క్రైం కార్నర్

ఆటో ఢీకొని బస్సు కిందకు దూసుకెళ్లిన బైక్

● యువతి మృతి, యువకుడి పరిస్థితి విషమం


ఘటనాస్థలంలో గుమిగూడిన జనం

కీసర రూరల్, ఆగస్టు 26: ఆటో ఢీకొని బస్సుకు కిందకు బైక్ దూసుకెళ్లిన ఘటనలో యువతి మృతి చెందగా ఓ యువకుడి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య వివరాల ప్రకారం.. నేరెడ్‌మెట్ దినకర్‌నగర్‌కు చెందిన రమ్య, కౌషిక్ అనే యువతీ యువకులు స్నేహితులు. కౌషిక్ రాంపల్లి చౌరస్తా వద్ద బైక్ మెకానిక్‌గా పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. రమ్య(20) అమెజాన్‌లో ఉద్యోగి. ఇరువురు కలిసి రాంపల్లి చౌరస్తా నుంచి రాంపల్లి వైపునకు తమ బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో వారు రాంపల్లిలోని ఆర్‌ఎల్‌నగర్‌కు చేరుకున్నారు. అయితే వీరి వీరి బైక్‌ను వెనుక నుంచి వస్తున్న ప్యాగో గూడ్స్ ఆటో ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పిన బైక్ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు కిందకు దూసుకెళ్లింది. బస్సు చక్రాలు రమ్య తలపై నుంచి వెళ్లగా ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందింది. కౌషిక్ తలకు తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం అతడు కోమాలో ఉన్నాడని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కౌషిక్‌ను చికిత్స నిమిత్తం నాచారంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం రమ్య మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి


ఆటో డ్రైవర్ పల్లె కిష్టప్ప

తాండూరు రూరల్, ఆగస్టు 26: ఆటో బోల్తాపడి గాయాలపాలైన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బిజ్వార్ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిజ్వార్ గ్రామానికి చెందిన పల్లె కిష్టప్ప(29) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈనెల 5వ తేదీన కొందరు కూలీలను ఎక్కించుకునేందుకు వెళుతుండగా ప్రమాదవశాత్తు రాఘవాపూర్-కోకట్ గ్రామాల మధ్య ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఆటో నడుపుతున్న పల్లె కిష్టప్ప గాయాలపాలయ్యాడు. కుటుంబీకులు కిష్టప్పను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం పది రోజుల కిందట ఇంటి వద్దే చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో మృతిచెందాడు. దీంతో కిష్టప్ప కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలోని ఆయన కుటుంబానికి కొంతమంది ఆర్థిక సాయం అందజేశారు. కిష్టప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువకుడు అదృశ్యం


మోహన్ కృష్ణ

మూడుచింతలపల్లి, ఆగస్టు 26: యువకుడు అదృశ్యమైన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తూంకుంటకు చెందిన ధూళ్ళ మోహన్‌కృష్ణ(20) తన బాబాయి అయిన ధూళ్ళ శ్రీనివాసరావు వద్ద ఉంటూ మోర్ సూపర్ మార్కెట్‌లో పని చేస్తున్నాడు. కాగా ఈనెల 21వ తేదీన పని నిమిత్తం కొంపల్లిలోని విజేత సూపర్ మార్కెట్ కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల వద్ద చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాడుతున్న 9 మందిపై కేసు


కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌లో పేకాడుతూ పట్టుబడిన నిందితులు

తాండూరు రూరల్, ఆగస్టు 26: పేకాడుతున్న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు కరన్‌కోట్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని గౌతాపూర్ శివారులో సోమవారం పేకాట స్థావరంపై పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించారు. అక్కడ తాండూరుకు చెందిన వ్యాపారులు ముస్తఫా, కె.సిద్దు, హైమద్, మోయిస్, రాజు, జోగి మధుసూదన్, ఎండీ.సలీం, ఈడిగి అశోక్, మహ్మద్ జావెద్‌లు పేకాడుతూ పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.7,810ల నగదు, పేక ముక్కలను సీజ్ చేసినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

మేడ్చల్ టౌన్, ఆగస్టు 26: సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన పులువు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మండల ఈశ్వర్, మండల రవి కుమార్, గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం


సత్యనారాయణరెడ్డి


సుదర్శన్

పరిగి, ఆగస్టు 26: టీయూటీఎఫ్ జిల్లా కొత్త కార్యవర్గాన్ని సోమవారం పరిగిలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా పి.సత్యనారాయణరెడ్డి, ప్రధానకార్యదర్శిగా బి.సుదర్శన్, గౌరవఅధ్యక్షుడిగా ఎం.బస్వరాజ్, సంయుక్తకార్యదర్శిగా ఎండీ సమియోద్దీన్, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ శివప్ప, కోశాధికారిగా ఎక్కెలి భాస్కర్, మహిళా కార్యదర్శిగా వై.బాలమణి, ఉపాధ్యక్షులుగా ఎం.అనిత, అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా ఎల్లయ్య, బాలకృష్ణలు ఎన్నికయ్యారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ఉద్యోగ, ఉపాధ్యాయులకుపాతపెన్షన్ విధానాన్నే అమలు చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.గోపాల్, జిల్లా అధ్యక్షుడిగా పి.సత్యనారాయణరెడ్డి, ప్రధానకార్యదర్శిగా బి.సుదర్శన్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిగిలో సోమవారం నిర్వహించిన సంఘ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షన్ అనేది ఉద్యోగి ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈవోలను భర్తీచేయాలని కోరారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా ఎంపీఈవోగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

పురాతన ఆస్పత్రి భవనం కూల్చివేత


పురాతన ఆస్పత్రి భవనాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

కొడంగల్, ఆగస్టు 26: కొడంగల్ ప్రభుత్వాసుపత్రి పురాతన భవనాన్ని సోమవారం కూల్చివేశారు. మండలంలోని అప్పాయిపల్లి శివారులో మెడికల్ వైద్య కళాశాల ఏర్పాటులో భాగంగా పురాతన భవనాన్ని కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 50 పడకల ఆసుపత్రి భవనం స్థానంలో 220 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం నిధులు మంజూరు కావడంతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.